క్లుప్తంగా

గర్భిణులకు ఉచిత రక్త పరీక్షలు



గర్భిణులకు రక్త పరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకటరమణ

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరం గ్రామంలో గర్భిణులకు మంగళవారం ఉచితంగా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. సమీకృత శిశు అభివృద్ధి సేవా పథకం పర్యవేక్షణలో భాగంగా సత్య చారిటబుల్ ట్రస్ట్, హెన్ ప్రాజెక్టుల సహకారంతో డాక్టర్ కాద వెంకటరమణ పరీక్షలు నిర్వహించి, మహిళలకు పోషక విలువలు గల ఆహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అల్లూరి సురేంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వికాస ద్వారా ఉచిత శిక్షణ, ఉద్యోగ కల్పన

కాకినాడ రూరల్: వికాస ద్వారా మండలంలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాల కోసం ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు గ్రామాలలో ఎంపికలు నిర్వహిస్తున్నారని కాపు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ లింగం రవి తెలియజేశారు. రేపూరు, గంగనాపల్లి, కొవ్వాడ గ్రామాల నిరుద్యోగులకు మంగళవారం కొవ్వాడ పంచాయతీ వద్ద వికాస పీడీ లచ్చారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఎంపిక కార్యక్రమం చేపట్టారన్నారు. బుధవారం ఇంద్రపాలెం, చీడిగ గ్రామాల నిరుద్యోగులకు ఇంద్రపాలెం పంచాయతీ వద్ద, గురువారం రమణయ్యపేట, సర్పవరం పంచాయతీలకు రమణయ్యపేట పంచాయతీ వద్ద ఈ కార్యక్రమాలు ఉంటాయని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కరాటేలో సాయి సూర్య ప్రతిభ



సాయి సూర్యను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విశాఖ రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో 3, 4 తేదీలో జరిగిన 7వ ఇంటర్‌నేషనల్ కరాటే పోటీలలో కాకినాడకు చెందిన పి.సాయి సూర్య ప్రతిభను కనపరిచాడు. కటా విభాగంలో కాంస్య, కుమితే విభాగంలో రజత పతకాలు సాధించాడు. స్థానిక కేకేఆర్ గౌతమ్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. సాయి సూర్యను పాఠశాల ప్రిన్సిపాల్ పి.వెంకటేశ్వర్లు, కరాటే కోచ్ బి.మనోహర్, పీఈటీ తిరుమలేష్ బుధవారం పాఠశాలలో అభినందించారు.

విద్యార్థులకు రూ.8.12 లక్షల స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్న మలబార్ సంస్థ యాజమాన్యం

కాకినాడ సిటీ: సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా అన్నవరం సత్యవతిదేవి ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో 88 మంది విద్యార్థినులకు మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ సంస్థ మంగళవారం స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేసింది. సామాజిక బాధ్యతలో భాగంగా ఈ స్కాలర్‌షిప్‌లను అందజేసింది. మున్సిపల్ కమిషనర్ జె.వెంకటరావు, రీజనల్ జాయింట్ డైరెక్టర్ పి.నాగమణి, డీఈవో జీజీకే నూకరాజు, ఏపీపీఎస్‌సీ మాజీ చైర్మన్ పి ఉదయ్‌భాస్కర్, మలబార్ సంస్థ జోనల్ హెడ్ ఫెబిన్, స్టోర్ హెడ్ నబీల్ తదితరులు పాల్గొని స్కాలర్‌షిప్‌లను విద్యార్థులకు అందజేశారు. ఒక్కొక్కరికి రూ.8 వేల నుంచి రూ.10 వేల చొప్పున రూ. 8.12 లక్షలు స్కాలర్‌షిప్‌లుగా అందించారు. గృహనిర్మాణం, వైద్య సహాయం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత, విద్య రంగాల్లో దృష్టి సారిస్తున్నట్లు గ్రూప్ ప్రతినిధులు ప్రకటించారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల ఆందోళన

కాకినాడ సిటీ: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జీజీహెచ్ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు చేపట్టిన ఆందోళన మంగళవారం కూడా కొనసాగింది. జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలివెల వీరబాబు, మలక వెంకటరమణ, ఆర్ రమేష్, శేషు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సమస్యలపై ఎన్‌జీఓల సమావేశం

కాకినాడ సిటీ: జిల్లాలో ఉద్యోగులందరూ ఉద్యోగుల సమస్యలపై పోరాటాలకు సిద్ధంగా ఉండాలని ఏపీ ఎన్‌జీవో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు జి.రామ్మోహనరావు పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం కాకినాడలో ఎన్‌జీవో అసోసియేషన్ భవన్‌లో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. 12వ తేదీన ప్రభుత్వానికి ఉద్యమ కార్యాచరణ నోటీసు ఇవ్వాలన్నారు. 14 నుంచి 26వతేదీ వరకు ధర్నాలు చేయాలని సమావేశం నిర్ణయించింది.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి

- ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు
- రాజకీయ పార్టీలతో సమావేశం



ఏటిమొగలో పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన ఈఆర్వో, కమిషనర్ వెంకటరావు

కాకినాడ: రానున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించడంలో రాజకీయ పార్టీల సహకారం కూడా ఎంతో అవసరమని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు పేర్కొన్నారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఓటర్ల సంక్షిప్త సవరణ -2024లో భాగంగా ఫారం-6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులు, వాటి ప్రగతిని ఈఆర్వో వివరించారు. ఈ సందర్భంగా ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధుల సందేహాలను ఈఆర్వో నివృత్తి చేశారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ సమస్యాత్మక ప్రాంతాల్లో తీసుకోవలసిన చర్యలు, టిడ్కో ఇళ్లకు డోర్ నంబర్ల కేటాయింపు సహా వివిధ అంశాలను సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే సూచనలు, సలహాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు. దోషరహిత, పారదర్శకమైన ఓటర్ల జాబితాతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడమే అంతిమ లక్ష్యమన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో రావూరి వెంకటేశ్వరరావు (వైఎస్సార్ సీపీ), గదుల సాయిబాబా (టీడీపీ), తుమ్మల రమేష్ (టీడీపీ), అప్పారావు (బీఎస్పీ), ఏఈఆర్వోలు హరిదాసు, నాగశాస్త్రులు, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలతో సమావేశం

ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏఈఆర్వోలు, బీఎల్‌వోలతో కమిషనర్ వెంకటరావు వేర్వేరుగా సమావేశమయ్యారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి రానున్న రోజుల్లో చేపట్టాల్సిన వివిధ కార్యక్రమాలపై సూచనలిచ్చారు. పోలింగ్ స్టేషన్లలో కల్పించాల్సిన సదుపాయలపై చర్చించారు.

పోలింగ్ స్టేషన్లలో వసతుల పరిశీలన

నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు మంగళవారం పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించారు. జగన్నాథపురంలోని ఏటిమొగ, కొండబాబు కాలనీ, గౌరీశంకర పేట, మత్స్యశాఖ కార్యాలయ ఆవరణలోని పీఎస్‌లకు వెళ్లిన ఆయన మౌలిక సదుపాయాలను ఆరా తీశారు. ఆయా పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, ర్యాంపులు, ఇతర సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించారు. ఏమైనా సదుపాయాల కొరత ఉంటే వెంటనే నివేదిక ఇవ్వాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లోనూ విధి నిర్వహణలో ఉండే సిబ్బందికి, ఓటర్లకు ఎటువంటి అసౌకర్యం లేకుండా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఆయన వెంట సూపర్‌వైజర్లు, బీఎల్వోలు ఉన్నారు.

ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయం



ఆరోగ్యశ్రీకార్డు అందజేస్తున్న ఎంపీడీఓ, మండల వైద్యాధికారి

కరప: ప్రజల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు గురించి, ప్రజలకు అవగాహన కల్పించి, ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు అందజేయాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. గురజనాపల్లిలో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ ఆర్.శ్రీనివాసనాయక్‌తో కలసి పర్యటించి, గ్రామ వలంటీర్లు, వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న కార్డుల పంపిణీని పరిశీలించారు. మండల పరిధిలో 25,596 మందికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకూ 18,994 మందికి అందజేసినట్టు ఎంపీడీఓ తెలిపారు. మరణించిన వారు, గ్రామాల్లో లేనివారు 5,400 మంది ఉన్నారన్నారు. ఇంకా ఇవ్వాల్సిన 1,202 కార్డులు గురువారానికి పూర్తిచేసేలా చర్యలు తీసుకున్నామన్నారు.

సీడీఎంఏకు కమిషనర్ల అభినందనలు



సీడీఎంఏ శ్రీకేష్ బిలత్కర్‌ను కలిసిన ఏడీసీ నాగనరసింహారావు తదితరులు

కాకినాడ: కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ)గా నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన ఐఏఎస్ అధికారి శ్రీకేష్ బిలత్కర్‌ను ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్లకు సంబంధించిన పలు అంశాలను సీడీఎంఏ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా అంశాల పట్ల సీడీఎంఏ సానుకూలంగా స్పందించారు. ఆయనను కలిసిన వారిలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, అడిషనల్ డైరెక్టర్ శివ పార్వతి, అధ్యక్షులు, కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, కోశాధికారి శివారెడ్డి, ఉపాధ్యక్షుడు భవానీ ప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ఏసుబాబు, పలువురు సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: జాతీయ రహదారి (నేషనల్ హైవే రోడ్డు) వెడల్పు చేసే క్రమంలో ఏపీ ట్రాన్స్‌కో ఈనెల 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రతాప్‌నగర్, గొల్లపాలెం 132 కేవీ సబ్‌స్టేషన్లు, 220 కేవీ కాకినాడ పరిధిలో మొత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు కాకినాడ ట్రాన్స్‌కో ఈఈలు జొన్నాదుల రామారావు, జి.ప్రసాద్, వై.విజయానంద్ మంగళవారం సాయంత్రం తెలిపారు. కాకినాడ, ప్రతాప్‌నగర్, పోర్టు ఏరియా, నడకుదురు, గొల్లపాలెం, మామిడాడ, తాళ్లరేవు, రామచంద్రపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందన్నారు. కనుక ప్రజలు సహకరించాలని, తగు ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు శ్రీనివాస్



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న లయన్స్ ఎలైట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: కాకినాడ ఆర్టీసి డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావు ఈ నెల 6 నుంచి 8 వరకు జరుగనున్న జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొనేందుకు గోవా వెళ్లారు. ఈ సందర్భంగా లయన్స్ అలైట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆయనకు వీడ్కోలు ఇచ్చారు. వెంకట్‌నగర్‌లో లయన్స్ మాజీ గవర్నర్ ముంజులూరి విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయనను సత్కరించారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలైట్ క్లబ్ ఎల్లప్పుడు సముచిత స్థానం ఇస్తుందన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ తన పర్యటన విజయవంతం అవ్వాలన్న ఆకాంక్షతో లయన్స్ సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఇప్పటి వరకు తాను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో 62 బంగారు పతకాలు సాధించినట్టు తెలిపారు. ఈ పోటీల్లోనూ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. పోటీలలో కూడా తప్పక విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గణేష్, సాగర్, రంగాభట్ల శ్రీనివాస్, పరశురామ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలపై శాశ్వత హక్కు

కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి



రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి

కాకినాడ: నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఇస్తున్న ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్లు చేస్తున్న విధానం పేదలకు వరమని కౌడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి పేర్కొన్నారు. స్థానిక 30వ డివిజన్ సచివాలయంలో మంగళవారం జరిగిన ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు పొందిన ప్రతి ఒక్కరికీ రిజిస్ట్రేషన్లు చేయడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రధానంగా ఇంత వరకు పొందిన స్థలాలను అనుభవించే హక్కుమాత్రమే ఉండేదని, ఇప్పుడు భవిష్యత్‌లో బదలాయించుకునే అవకాశం కూడా ఉంటుందన్నారు. అవసరమైతే ఈ డాక్యుమెంట్లపై రుణాలు కూడా పొందే వెసులుబాటు ఉంటుందన్నారు. పేదలకు ప్రయోజనం కలిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చొరవతో కాకినాడలో సుమారు 30 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారని, వీరందరికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరుగుతోందన్నారు.

ఆరోగ్యశ్రీతో మరిన్ని మెరుగైన సేవలు

- పరిమితి పెంపుతో పేదలకు మరింత ప్రయోజనం
- కార్పొరేషన్ కమిషనర్ వెంకటరావు



ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటరావు

కాకినాడ: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు పొందే పరిమితిని ప్రభుత్వం రూ.5 లక్షల నుంచి రూ. 25 లక్షలకు పెంచిందని నగరపాలక సంస్థ కమిషనర్ జె. వెంకటరావు చెప్పారు. ఇప్పటికే అనేక వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చిన ప్రభుత్వం ఇప్పుడు వైద్య సేవల పరిమితిని కూడా పెంచడం వల్ల పేదలకు ఎంతో ప్రయోజనకరమన్నారు. స్థానిక జగన్నాథపురం 25వ డివిజన్ పరిధిలోని న్యూ మున్సిబ్ జంక్షన్ సచివాలయంలో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా ఆదేశాల మేరకు ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని కమిషనర్ వెంకటరావు మంగళవారం పర్యవేక్షించారు. అక్కడకు వచ్చిన లబ్ధిదారులతో కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో 83 వేల మంది లబ్ధిదారులు ఆరోగ్యశ్రీ కార్డులకు అర్హులుగా గుర్తించారన్నారు. సుమారు 74 వేల కొత్త ఆరోగ్య శ్రీ కార్డులు వచ్చాయన్నారు. వీటిలో 56 వేల కార్డులను ఇప్పటికే పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు. ఆయన వెంట ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఏకాగ్రతతోనే మంచి ఫలితాలు

ఆర్‌జేడీ నాగమణి



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఆర్‌జేడీ నాగమణి

కాకినాడ: ప్రశాంతత, ఏకాగ్రతతో చదివి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించగలరని పాఠశాల విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ డి.నాగమణి పేర్కొన్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ సంస్థ తన సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా 10వ తరగతి విద్యార్థులకు నైపుణ్యం, స్వయం అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళిక అనే అంశాలపై స్థానిక దంటు కళాక్షేత్రంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆర్‌జేడీ నాగమణి, వ్యక్తిత్వ వికాస నిపుణులు డాక్టర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పాల్గొని విద్యార్థులకు పరీక్షలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ధీరూబాయి అంబానీ చిత్రంతో కూడిన పరీక్షల ప్యాడ్, వ్యక్తిత్వ వికాస పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ ప్రతినిధులు డి.వేణుగోపాలరాజు, పోతాప్రగడ సుబ్రహ్మణ్యం, పడాల చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మోదీ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త బంద్



కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కాకినాడ సిటీ: మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ 16వ తేదీన దేశవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని కేంద్ర కార్మిక సంఘాల సన్నాహక సమావేశం పిలుపునిచ్చింది. మంగళవారం సాయంత్రం కచేరీ పేట సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ రైతుల పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని తదితర డిమాండ్లు చేసింది. 8వ తేదీన కాకినాడలో విస్తృత రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాలని, 9, 10 తేదీల్లో పరిశ్రమలకు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలకు, వ్యాపార సంస్థలకు బంద్ నోటీసులు అందించాలని, 13, 14 తేదీల్లో ఆటో ప్రచారం నిర్వహించాలని, 16వ తేదీన జిల్లా బంద్ జరిగేలా ఏర్పాట్లు చేయాలని కార్యాచరణ ప్రకటించారు. కేంద్ర కార్మిక సంఘాల నాయకులు జి.బేబీరాణి, రాజబాబు, తాళ్లూరి రాజు, అంజిబాబు తదితరులు

రైలు బోగీలో మృతదేహం



రైలు బోగీలో గుర్తించిన వ్యక్తి మృతదేహం

కాకినాడ క్రైం: కాకినాడకు వచ్చిన ఓ రైలు బోగీలో జీఆర్‌పీ సిబ్బంది మృతదేహాన్ని గుర్తించారు. ఈ మేరకు ఎస్‌ఐ ఎన్.రవికుమార్ మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం బెంగళూరు నుంచి కాకినాడకు చేరిన శేషాద్రి ఎక్స్‌ప్రెస్ ఎస్-10 బోగీలో ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. సదరు వ్యక్తి వయసు 50 ఏళ్లు ఉండొచ్చని, నలుపు తెలుపు చారల ప్యాంట్, గళ్ల చొక్కా ధరించి ఉన్నాడని ఎస్‌ఐ తెలిపారు. గుండె పోటు, అనారోగ్యం కారణంగా మరణించి ఉండవచ్చని భావిస్తున్నామన్నారు. మృతదేహాన్ని కాకినాడ జీజీహెచ్‌లో భద్రపరిచినట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్‌లో ఉన్న జీఆర్‌పీ సిబ్బందిని సంప్రదించాలని రవికుమార్ కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటర్ల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎంఈఓ సత్యనారాయణ

కరప: ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, ఓటరుగా నమోదుచేసుకోవాలని ఎంఈఓ పి.సత్యనారాయణ అన్నారు. వేములవాడలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు వేయాలన్నారు. పోటీచేసే అభ్యర్థులలో సమసర్థులు, నిజమైన ప్రజాసేవ చేసేవారిని, పరిపాలనాదక్షులను, నిజాయతీపరులను, ప్రజల ఆస్తులను పరిరక్షించే వారిని సరిచూసుకుని ఎన్నుకోవాలని ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా ఓటుహక్కుపై అవగాహన కల్పించి ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. హెచ్‌ఎం ఎస్.శ్రీనివాస్, సీఆర్పీ పి.రాజు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు పైనుంచి జారి పడి వ్యక్తి మృతి



సత్యనారాయణ మృతదేహం

కాకినాడ క్రైం: తన సామాన్లు దింపేందుకు బస్సు పై కప్పు ఎక్కిన ఓ ప్రయాణికుడు ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. సంబంధిత వివరాలివీ... ఉప్పాడ కొత్తపల్లి మండలం ఉప్పాడ గ్రామానికి చెందిన 75 ఏళ్ల రెడ్నం సత్యనారాయణ మంగళవారం కాకినాడకు వచ్చి సరకులు కొనుగోలు చేసి ఆర్టీసీ బస్సులో తిరిగి ప్రయాణమయ్యాడు. కాకినాడ నుంచి అద్దరిపేట వెళ్లే బస్సు ఎక్కి అమీనాబాద్‌లో దిగాడు. కాకినాడలో బస్సు ఎక్కినప్పుడు బస్సు పై కప్పుపై కట్టిన తన సామాన్ల మూటలు దించుకునేందుకు డ్రైవర్‌కి చెప్పకుండా పైకి ఎక్కాడు. ప్రయాణికులంతా దిగిపోయారని భావించిన డ్రైవర్ బస్సు స్టార్ట్ చేసి ముందుకు వెళ్లడంతో సత్యనారాయణ బస్సు పైనుంచి జారి ఒక్కసారిగా కిందికి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా స్థానికులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సత్యనారాయణ మంగళవారం రాత్రి మృతి చెందాడు.

భద్రతా నియమాలపై అవగాహన అవసరం

ఆర్టీసీ డీఎం మనోహర్



విద్యార్థులకు బహుతులు అందజేస్తున్న డిపో మేనేజర్ మనోహర్

కాకినాడ: రహదారి భద్రత నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ పేర్కొన్నారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం వివిధ కళాశాలల విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఆదిత్య జూనియర్ కళాశాలలో జరిగిన క్విజ్ పోటీలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులు డి.చరణ్‌తేజ్, ఎ.అవనీష్, ఎండీ షామిక్‌లకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.సత్యనారాయణరెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, ట్రాఫిక్ సూపర్‌వైజర్ ఏవీవీఎస్ఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ సిటీ అయితే మాకేంటి?

- అద్దంలాంటి రహదారులపై యథేచ్ఛగా పశు సంచారం
- తీరు మార్చుకోని యజమానులు
- మూగజీవాలతో ప్రజలకు ఆటంకం



ఐటీఐ, జేఎన్‌టీయూకే కూడలి మధ్యలో ఉన్న పశువులు

బాలాజీచెరువు: స్మార్ట్‌సిటీగా రూపుదిద్దుకుంటున్న కాకినాడ నగరాన్ని పశువుల విచ్చలవిడి సంచారం వేధిస్తోంది. రహదారులపైనా, కార్యాలయాల ఆవరణల్లో, రైతు బజార్ల వద్ద అడ్డదిడ్డంగా సంచరిస్తూ ప్రజలకు అవరోధం కల్పిస్తున్నాయి. పెదమార్కెట్, ఆర్టీసీ కాంప్లెక్ రైతుబజార్, గాంధీనగర్ రైతు బజార్ వంటి ప్రాంతాల్లో గుంపులుగా ఏర్పడి అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. ఇక మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అయితే ప్రధాన రహదాదారులు జీజీహెచ్, ఇంద్రపాలెం బ్రిడ్జి, బాలాజీచెరువు, భానుగుడి, జేఎన్‌టీయూ కూడలి, నాగమల్లితోట జంక్షన్ వంటి ప్రాంతాలలో 20 నుంచి 30 వరకూ గుంపులుగా సంచరిస్తూ రోడ్డు మధ్యలో తిష్టవేస్తాయి. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఒక్కోసారి వాహనచోదుకులపైకి రావడంతో వారు ప్రమాదాల బారిన పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

డివైడర్ల మధ్య పచ్చికని పాడుచేస్తూ..

నగరంలో ప్రధాన రహదారుల్లో దాదాపు ఐదు కిలోమీటర్ల మేర ఉన్న డివైడర్ మధ్య పచ్చని పచ్చిక వేశారు. స్మార్ట్ సిటీ నిధులు రూ.లక్షలు వెచ్చించి ఆదునీకరిస్తున్నారు. వీటిని పాడుచేసి తినేస్తూ అపరిశుభ్రంగా చేస్తున్నాయి. పశువుల యజమానులను కార్పొరేషన్ అధికారులు హెచ్చరించినా రెండు మూడు రోజుల తరువాత షరా మామూలుగానే దర్శనమిస్తున్నాయి. అధికారులు వీటిపై శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్పొరేషన్ ఎంహెచ్‌ఓ పృథ్వీచరణ్‌ను వివరణ కోరగా పశువుల యాజమానులకు సమాచారం ఇచ్చి వాటిని రోడ్లపైకి రాకుండా చూసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు.

పచ్చదనాన్ని పాడుచేస్తున్నాయి



పచ్చదనం కోసం రహదారి మధ్యలో వేసిన పచ్చిక వాటికి ఆహారంగా పనికి రాకపోయిన వాటిని కొరికివేయడంతో పచ్చదనం కాస్తా పోతుంది. లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేస్తున్నా మూణ్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. రానున్న వేసవికాలం దృష్ట్యా ఇటువంటి వాటిపై దృష్టి పెట్టి పశువుల పాడుచేయకుండా కాపాడాలి.

–కె.శ్రీనివాసరావు, నేషనల్ గ్రీన్‌కోర్ కన్వీనర్

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

పిఠాపురం: రానున్న ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో అందరూ ఓటు వేసే విధంగా శాంతి భద్రతల రక్షణకు ప్రజల భాగస్వామ్యంతో చర్యలు తీసుకుంటున్నట్టు పిఠాపురం సీఐ శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురంలో మంగళవారం పోలింగ్ స్టేషన్లను ఆయన పరిశీలించారు. అనంతరం స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికలు ఎటువంటి వివాదాలకు తావు లేకుండా జరగడానికి అందరూ సహకరించాలని కోరారు. ఓటు హక్కును అందరూ ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని సూచించారు. పట్టణంలో శాంతి కమిటీని ఏర్పాటు చేసి శాంతి భద్రతల సమస్యలు రాకుండా చూడాలని కోరారు.